క్లుప్తంగా

కార్యదర్శులతో ఎంపీడీఓ సమావేశం


గ్రామసభలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుజాత

కొత్తపట్నం: నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ మేరీ మాటి మేరే దేశ్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీవో పి.సుజాత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యాదర్శులు, సచివాలయం సిబ్బందితో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ మేరీ మాటి భాగంగా పంచాయతీ గ్రామసభలు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి ఆగస్టు 25 వరకు గ్రామసభలు నిర్వహించాలని కోరారు. గ్రామ సభలో యోగా చేయటం, మొక్కలు నాటే కార్యక్రమం తప్పకుండా చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో వలంటీర్ పరిధిలో ఉన్న 50 ఇళ్లకు ఇంకుడు గుంతలు, ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగు దొడ్లు ఉన్నాయా, లేదా సర్వే చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ ఆదేశించారు. ఈవోఆర్డీ బాలచెన్నయ్య మాట్లాడారు. హౌసింగ్ ఏఈ అన్నం నాంచార్లరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ


ప్రధానోపాధ్యాయునికి బీరువా అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నాగులుప్పలపాడు: మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలోని ఏకేజీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1999–2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు బీరువాను బుధవారం పాఠశాలకు అందజేశారు. ఇటీవల జరిగిన ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తాము చదివిన పాఠశాలకు తమ వంతుగా చేయూత అందించాలని అడగగా బీరువా అవసరం అని ప్రధానోపాధ్యాయుడు తెలపడంతో ఆ బీరువాను హెచ్ఎం చలపతికి అందజేశారు. ఎంఈవో–1 రవి, ఎంఈవో–2 ఈవీ రమణయ్య, పూర్వ విద్యార్థులు ,చినగంజాం ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, కల్లూరు ఎస్సై గారపాటి రాజ్యలక్ష్మి, డా.యాదాల అనీల్, శ్రీహరి రెడ్డి, కోయి శ్రీహరినాథ్, జ్యోతుల అనీల్ ఉన్నారు.

అందరికీ పథకాలు అందించడమే లక్ష్యం

● సర్టిఫికెట్లు అందించిన ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు:

అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకాలు అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మండలంలోని అన్నంగి, దొడ్డవరం గ్రామాల్లో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన పథకాలను 99.5 శాతం పూర్తి చేశారని, చెప్పని పథకాలను ఎన్నో అమలు చేశారని అన్నారు. ప్రజలు సంతృప్త స్థాయిలో ఉన్నారా లేదా అని తర్కించుకున్నప్పుడు అర్హులైన వారు మరి కొందరికి పథకాలు అందకపోవడంపై ఆయన జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. అర్హులకు అవసరమైన సర్టిఫికెట్లు అందజేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో ఏవైనా సర్టిఫికెట్లు కానీ, పథకాలు కానీ అందాలంటే జన్మభూమి కమిటీల ప్రాపకం ఉంటేనే అందేవని, కానీ నేడు పార్టీలకు అతీతంగా పథకాలు ప్రతి ఇంటిలోకి వచ్చాయని తెలిపారు. ప్రజలు తాను గడప గడపకు తిరుగుతున్న సమయంలో తమకు అందిన పథకాలను వివరిస్తూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఏగ్రామంలో అయినా పార్టీ పేరుతో పథకం అందలేదని టీడీపీ నాయకులు చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. ప్రజలకు పలు సేవలు అందిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచిన వలంటీర్లను పవన్ కల్యాణ్ కించపరుస్తూ మాట్లాడడం బాధాకరమని, అది ఆయన కుసంస్కారానికి నిదర్శనమని అన్నారు. చంద్రబాబు తన హయాంలో గ్రామానికి ఏం చేశాడో చెప్పాలని ఆ పార్టీ నాయకులను ప్రశ్నించారు. తమ ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో అన్నంగి గ్రామానికి రూ.3 కోట్లకుపైగా ఖర్చు చేసి గ్రామానికి రహదారి, సచివాలయ భవనాలు నిర్మించామన్నారు. ముందుగా ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా పలు పథకాలు ప్రతి ఇంటికి చేరాయని, గత ప్రభుత్వంలో చంద్రబాబు ఎందరికి పథకాలు అందించారో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో వారి వెంట వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, సీనియర్ నాయకులు గుడ్డపాతల రవి, రాయపాటి వెంకట రమేష్, వెంకటాద్రి, సన్నపురెడ్డి రమణమ్మ, బెజవాడ రాము, పోతినేని శ్రీనివాసరావు, ఎర్ర దశరథ రామయ్య, విల్సన్, సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి, బూరేపల్లి సర్పంచ్ రావిపాటి అంజమ్మ, ఎంటీసీ రావిపాటి వెంకట సుజాత, ఎంపీటీసీలు పైనం ప్రభాకర్, బొమ్మల దాసు, సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు అన్వేష్, దుడ్డు వినోద్, తిప్పగుడిశ కిషోర్‌బాబు, మార్నేని లక్ష్మీనారాయణ, బత్తుల శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


అర్హులైన లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో పార్టీ నాయకులు

ఒంగోలు రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలన్నీ కుల, మత, రాజకీయ, వర్గాలకు అతీతంగా అందజేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టారని ఒంగోలు మండల పరిషత్ అధ్యక్షుడు పల్లపోలు మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని యరజర్ల సచివాలయ ప్రాంగణంలో సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అన్నీ ప్రభుత్వ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒంగోలు మండల తహసీల్దార్


ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచ్

మాట్లాడుతూ రానున్న కాలంలో అర్హులెవరూ తమకు పథకాల లబ్ధి అందలేదని చెప్పకూడదన్నారు. ప్రభుత్వం 11 రకాల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిందన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా, పారదర్శకంగా ఒంగోలు మండల గ్రామాలన్నింటిలో పూర్తిస్థాయి సర్వే నిర్వహించిన అనంతరం అర్హులను గుర్తించి కుల,ఆదాయ, వివాహ, ఫ్యామిలీ మెంబర్, కౌలుదారు ధ్రువీకరణ పత్రాలతో పాటు మొత్తం 11 రకాల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు తహసీల్దార్ పసుపులేటి మురళి అన్నారు. ఒంగోలు ఎంపీడీవో పి.అజిత మాట్లాడుతూ గ్రామాల్లో టెక్నికల్ కారణాలతో సర్వే అవగాహన లోపంతో గతంలో కొందరికి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేదని, వారిని గుర్తించి పారదర్శకంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహించారని చెప్పారు. సచివాలయ కన్వీనర్ సోమశేఖర్ మాట్లాడుతూ పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు తమ్మిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వాల వలే ఒక ధ్రువీకరణ పత్రం కోసం రోజుల తరబడి జన్మభూమి కమిటీల వద్ద వేచి ఉండే దుస్థితి తొలగిందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పందిళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం పేద, బడుగు వర్గాలకు ఎప్పుడూ అండగా నిలుస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఏడాదికి రెండు సార్లు జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందన్నారు. గ్రామ ఉప సర్పంచ్ హరిబాబు, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, వీఆర్వో శ్రీధర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు. తొలుత అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అధికారులు అందజేశారు. సభానంతరం అధికారులు వలంటీర్లకు ఘనంగా సన్మానం చేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

● సీడీపీఓ ఇవాంజిలిన్

మద్దిపాడు: మద్దిపాడు ఐసీడీఎస్ పరిధిలోని మద్దిపాడు, సంతనూతలపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు మండలాల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ ఇవాంజిలిన్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆర్ఎల్‌పురం అంగన్‌వాడీ వర్కర్ పోస్టు, వై గుడిపాడు మినీ అంగన్‌వాడీ, మద్దిపాడు, నాగన్నపాలెం, అన్నంగి, కొనగానివానిపాలెం, మద్దులూరు, నేకునాంబాద్, కొత్తపాలెం, రంగసాయిపురం, కేసీహెచ్ ఉప్పలపాడు, వినోదరాయునిపాలెం గ్రామాల్లో హెల్పర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఈనెల 19 నుంచి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఐసీడీఎస్ ప్రాజెక్టు మద్దిపాడు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

నిధులన్నీ పంచాయతీల అభివృద్ధికే ఖర్చు చేయాలి

● ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: వచ్చిన నిధులు వెనక్కు పంపకుండా ఖర్చు పెట్టి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.60 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. మొదటిగా చెత్త సంపద తయారీ కేంద్రానికి రోడ్లు వేసేందుకు, మరమ్మతులకు వాడుకోవాలన్నారు. ఆలస్యం చేయకుండా వారం రోజుల్లో తీర్మానాలు ఇస్తే పనులు ప్రారంభిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ సచివాలయాలు, హెల్త్ క్లీనిక్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలకు రూ.85 లక్షల బిల్లులు వారంలో అకౌంట్‌లో జమవుతాయన్నారు. కె.పల్లెపాలెం నుంచి గుండమాల వరకు గ్రావెల్ రోడ్డుకు, కె.పల్లెపాలెం, రంగాయపాలెం, గుండమాల, మోటుమాల పంచాయతీలకు వచ్చిన ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేటాయించాలని సర్పంచ్‌లకు సూచించారు. ఎంపీడీవో పి.సుజాత, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, హౌసింగ్ ఏఈ అన్నం నాంచార్లరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

ఊమెన్ చాందీకి లయన్స్ క్లబ్ సభ్యుల నివాళి

ఒంగోలు అర్బన్: కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఊమెన్ చాందీ చిత్రపటానికి లయన్స్ క్లబ్ ఆఫ్ సిటిజన్స్ సభ్యులు నివాళులర్పించారు. వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 2018లో లయన్స్ క్లబ్ అధ్యక్షుల ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా ఒంగోలు వచ్చిన సందర్భాన్ని తలుచుకున్నారు. దీనిలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, సీనియర్ నాయకులు మాంటిస్సోరి ప్రకాష్, సుధాకర్ రెడ్డి, సత్యన్ నయనాల, రామకృష్ణ, ఆంధ్రా శ్రీను, ఇక్బాల్ రాఘవ పాల్గొన్నారు.


ఊమెన్ చాందీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రూ.30 లక్షలతో తారు రోడ్డు పనులు ప్రారంభం

చీమకుర్తి: మండల పరిషత్ నిధులు రూ.30 లక్షలతో నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ వీరాంజనేయులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏలూరి సుబ్బారావు బుధవారం ప్రారంభించారు. ఏలూరివారిపాలెం నుంచి కొనగానివారిపాలెం వరకు 500 మీటర్ల పొడవునా తారు రోడ్డు నిర్మిస్తున్నారు. ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన వారం రోజుల్లోపే తారు నిర్మాణం పనులు చేపట్టడంతో స్థానిక గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తారు నిర్మాణం వలన కూనంనేనివారిపాలెం నుంచి ఏలూరివారిపాలెం మీదుగా సంతనూతలపాడు మండలంలోని కొనగానివారిపాలెం వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలతో తోడ్పడుతుందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


తారు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, కన్వీనర్ వెంకటేశ్వర్లు

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చీమకుర్తి: చీమకుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కే.రాఘవేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో ఈ సమావేశం నిర్వహిస్తారన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖలకు సంబంధించిన అధికారులు సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

ఇసుక అక్రమ నిల్వలపై తహసీల్దార్ దాడులు


అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని స్వాధీనం చేసుకున్న తహసీల్దార్, సిబ్బంది


అక్రమంగా డంప్ చేసిన ఇసుక

● లారీ స్వాధీనం

నాగులుప్పలపాడు: అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లపై తహసీల్దార్ సుజన్ కుమార్ దాడి చేసి నిల్వ ఉంచిన ఇసుకతో పాటు లారీని స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం సాయంత్రం నాగులుప్పలపాడులో చోటు చేసుకుంది. నాగులుప్పలపాడులో అక్రమంగా ఇసుక నిల్వ చేస్తున్న పరిస్థితిని గమనించిన తహసీల్దార్ సుజన్ కుమార్ ఈ ఇసుక డంప్‌ను పరిశీలించారు. మద్దిరాలపాడు గ్రామానికి చెందిన ఖాజావలి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక నిల్వ చేస్తున్నట్లు గుర్తించి ఇసుకతో పాటు లారీని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

భూగర్భ జలాలు పెంచాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: భూగర్భ నీటి మట్టం పెంచేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికాబద్ధంగా మరింత దృష్టి సారించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు.ప్రకాశం భవనంలో జిల్లా భూగర్భ జల సమన్వయ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. కేంద్ర భూగర్భ జల బోర్డు నుంచి వచ్చిన సభ్యులు ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించి నాక్విమ్ (నేషనల్ అక్విఫైర్ మ్యాపింగ్ అండ్ మేనేజ్‌మెంట్) రిపోర్టును కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఇప్పటికే 53 గ్రామాల్లో భూగర్భ జలాలు పరిమితికి మించి తోడి వాడుకోవడం వల్ల నీటి మట్టం పడిపోయిందని తెలిపారు. భూగర్భ జలాలను మితిమీరి వాడకుండా చూడటంతోపాటు బోరు బావుల కింద వరికి బదులుగా ఉద్యాన పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని శాస్త్ర వేత్తలు సూచించారు. ఇప్పటికే భూగర్భ జలాల మట్టం పెంచేందుకు డ్వామా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కట్టడాలకు అదనంగా మరో 553 నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రతిపాదించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో రైతులకు ఆ దిశగా అవగాహన కల్పించడంతో పాటు భూగర్భ నీటి వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలను తెలియచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో భూగర్భ జల శాఖ డీడీ విద్యాసాగర్, డ్వామా పీడీ శ్రీనారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, శాస్త్రవేత్త రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

180 మంది రోగులకు కంటి ఆపరేషన్‌లు

చీమకుర్తి: బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ తరఫున గుంటూరు జిల్లా పెదకాకాని శంకర్ కంటి ఆస్పత్రిలో మొదటి బ్యాచ్‌లో 180 మందికి కంటి ఆపరేషన్‌లు చేయించుకొని బుధవారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. వారికి బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ సిబ్బంది పండ్లు, బ్రెడ్‌లను అందించి ఇంటికి పంపించారు. ఈనెల 13న సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బూచేపల్లి కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో దాదాపు 973 మంది కంటి ఆపరేషన్‌లకు ఎంపికైన సంగతి తెలిసిందే. వారిని బ్యాచ్‌ల వారీగా విభజించి మొదటి బ్యాచ్‌లో 180 మందికి ఆపరేషన్‌లు చేయించి తీసుకొచ్చినట్లు బూచేపల్లి ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.


కంటి ఆపరేషన్‌లు చేయించుకొని వచ్చిన వారికి పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేస్తున్న బూచేపల్లి ట్రస్ట్ సిబ్బంది

పశువుల కొష్టం, వరిగడ్డి వామి దగ్ధం

నాగులుప్పలపాడు: కొష్టాంలో గేదెలకు దోమలు కుట్టకుండా వేసిన పొంగ మంట రూపంలోకి మారి కొష్టం, వరిగడ్డి వామి అగ్నికి ఆహుతి కాగా కొష్టంలో కేట్టసిన నాలుగు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఈదుమూడిలో మంగళవారం రాత్రి కొదమల ఇస్మాయేలుకు కొష్టంలో జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఇస్మాయేలుకు ధైర్యం చెప్పి తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేశారు. గేదెలకు ఆధునిక వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. బాధితునికి ప్రభుత్వ సబ్సిడీ ద్వారా గేదెలు మంజూరు చేసి సబ్సిడీపై దాణా మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. పార్టీ సీనియర్ నాయకులు కూనం పూర్ణచంద్రరావు, కుమ్మారి సుధాకర్, పోలవరపు శ్రీనమన్నారాయణ, కూనం చిన్న వీరయ్య ఉన్నారు.


భాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్, నాయకులు

నేడు 5వ సెమిస్టర్ మూల్యాంకనం

ఒంగోలు: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ 5వ సెమిస్టర్ మూల్యాంకనం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ డి.కళ్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏకి సంబంధించి ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటికల్ సైన్స్, బీకాం కామర్స్‌కు సంబంధించిన అన్ని సబ్జక్టుల పేపర్లు వచ్చాయన్నారు. చీరాల, మార్కాపురం, ఒంగోలులోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కాలేజీల అధ్యాపకులంతా తమ రిలీవింగ్ తీసుకుని క్యాంపునకు హాజరుకావాలన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడు ఒంగోలు రాక నేడు

ఒంగోలు అర్బన్: గిరిజన యువకుడిపై జరిగిన దాడికి సంబంధించి బాధితుడ్ని పరామర్శించేందుకు, దాడికి సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ గురువారం ఒంగోలు వస్తున్నట్లు పౌర సమాచార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటలకు ఒంగోలు చేరుకుంటారని పేర్కొంది.


దరఖాస్తున్న నమోదు చేసుకుంటున్న మహిళ


సమాచారం ఇస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్


పత్రాలు సరి చూసుకుంటున్న మహిళలు


ఇంటికి వెళ్లి ధ్రువపత్రాలు ఇస్తున్న వలంటీర్

భేష్.. జగనన్న!

జగనన్న సురక్ష సభలకు జనం భారీ సంఖ్యలో హాజరై వివిధ రకాల ధ్రువపత్రాలు పైసా ఖర్చు లేకుండా.. సమయం వృథా కాకుండా తీసుకుంటున్నారు. ఒంగోలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష సభలకు జనం హాజరై సర్టిఫికెట్లు తీసుకున్నారు. సీఎం జగన్‌ను అభినందించారు.

- సాక్షి, ఒంగోలు


ఒంగోలులో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష సభకు హాజరైన మహిళలు

ఆర్డీ యాస్మిన్ విచారణ


ఆర్డీ యాస్మిన్‌కు ఆహ్వానం పలుకుతున్న డీఎంహెచ్ఓ పెంచలయ్య

నెల్లూరు (బారకాసు): గతంలో నెల్లూరులోను, ప్రస్తుతం ప్రకాశం జిల్లా డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మిపై వచ్చిన ఆరోపణల గురించి బుధవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఆర్డీ యాస్మిన్ విచారణ చేపట్టారు. విచారణకు డాక్టర్ రాజ్యలక్ష్మితో పాటు అప్పటి కార్యాలయ పరిపాలనాధికారి, అకౌంటెంట్, సూపరింటెండెంట్, ఇన్‌చార్జి డెమో, నలుగురు సీనియర్ అసిస్టెంట్లు మొత్తం 9 మంది హాజరయ్యారు. వారి నుంచి లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీ యాస్మిన్ మీడియాతో మాట్లాడుతూ విచారణ నివేదికను వారం రోజుల్లో రాష్ట్ర ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.